# గోంగూర పచ్చడి

ఆనాడు ఆదివారం. బద్ధకంగా ఒక మాటు వళ్లువిరుచుకొని, నిద్రమంచం మీద నుండి లేచి టూత్ బ్రష్ చేతపుచ్చుకొనేటప్పటికి గోడగడియారం ఠంగ్ ఠంగ్ మని 8 గంటలుకొట్టింది. అప్పుడే ఎనిమిదయిందా! అనుకుంటూ బయటకు వెళ్లి అరుగుమీద కూర్చుని ముఖంకడుక్కుని తువ్వాలతో ముఖంతుడుచుకుంటూ పడక కుర్చీలో కూర్చున్నాను.

ఇంతలో మా శ్రీమతి ఆవిర్లు విరజిమ్ముతున్న వేడి కాఫీ గ్లాసుపట్టుకొనివచ్చింది. అది అందుకొని నోటితో చల్లార్చుకుంటూ కాఫీ త్రాగి ఖాళీగ్లాసు బల్లమీద పెట్టాను. ఆనాడు ఆఫీసుకు శలవు అవటంవల్ల చెయ్యటానికి పనేమీ లేక యింటిచూరువంకా, వాసాల వంకా చూస్తూ కొంతసేపు గడిపాను. అట్లాఎంతసేపు చూడగలను. కొంతసేపటికి విసుగుపుట్టి ఏదయినా పుస్తకం చదువుకుందామని చూచేటప్పటికి బల్లమీద పిల్లలు చదువుకొనే ఏదోశతకం కనిపించింది. అదేచదువుదామని తెరిచేటప్పటికి యీ క్రిందపద్యం కంటపడ్డది.

వెల్లుల్లిబెట్టి పొగిచిన
పుల్లని గోంగూరరుచిని
బాగడగవశమా
మొల్లముగనూనె వేసుక
కొల్లగ భుజియింపవలయు
........" ఇది చదివేటప్పటికి చెప్పద్దూ మరి నాకూ నోరూరింది. ఇవ్వాళ ఏమయినాసరే! గోంగూర పచ్చడి తినాలనుకొన్నాను. మరయితే గోంగూర ఎక్కడ దొరుకుతుంది: మార్కెట్లో ఏమయినా అమ్ముతారేమో వెంకన్నని పంపించి చూడాలి. అహా నా బుద్ధి గోంగూర తింది. మొన్ననే గదూ మా శ్రీమతి పెరటిదొడ్లో గోంగూరచల్లింది. ఆ సంగతే మరిచాను అనుకుంటూ "ఏమేవ్! రాజ్యం ఓసారి యిట్లారా!" అని మా శ్రీమతిని కేకేశాను. "ఎందుకండీ పిలిచారు" అంటూ మా

సి. విశ్వనాథం

శ్రీమతి నా ముందు సాక్షాత్కరించింది. "ఓసేవ్! చూడు. మన పెరటిదొడ్లో గోంగూర బాగా పెరిగిందికదూ! అది కోసి చక్కగా వేయించి వెల్లుల్లిపాయలు బాగా వేసి నూరి, పచ్చడిచెయ్యి తెలిసిందా" అన్నాను.

"పచ్చడా! పచ్చడేం బాగుంటుందండీ? చక్కగా ఆనప కాయ ముక్కలువేసి పులుసువండుకుంటే జిహ్వ లేచివస్తుంది. ఎన్నాళ్లనుంచో అనుకుంటూన్నా పులుసు వండుకుందామని. ఎప్పటికప్పుడే మర్చిపోవటంతోనే సరిపోతోంది." అన్నది మా శ్రీమతి.

"పులుసంటేనే నాకసహ్యం. దాని పేరు చెబితేనే డోకువచ్చే పర్యంతం అవుతుంది. విశేషంగా నామాట విని పచ్చడి చెయ్యి." అన్నా.

"మీ యిష్టమే యిష్టమా! ఎన్నాళ్ళనుండో రెక్కలు ముక్కలయ్యేటట్లు నీళ్లుపోసిపెంచుతే నా యిష్టాన్ననుసరించి చేసుకోటానికి వీల్లేదా?" అంది మా శ్రీమతి చిన్న పుచ్చుకున్న ముఖంతో.

"అదంతా అవతలపెట్టు యివ్వాళ ఆరునూరయినా గోంగూరపచ్చడి చెయ్యాలిసిందే" అన్నాను.

"ఎన్నడూ లేంది యివ్వాళమిమ్మల్ని గోంగూరపచ్చడి పట్టుకుందే" అంటూ మూతి అష్టవంకరలు త్రిప్పింది మా శ్రీమతి. "గోంగూర పచ్చడి రుచి నీకేంతెలుసు పులుసో పులుసో అని అఘోరిస్తావు చూడు. ఒక కవిగారు గోంగూరపచ్చడిని గురించి ఏమన్నారో విను"

"వయరకూర వేచి
పచ్చిమిరపపండ్లనుక్కళించి
పోసి యూరగిచ్చి
కొంత కొంత పొగచి
కొనుగోఁగు బచ్చడి
చవికినోరు...చివికితీరు"

అన్నారు. కనుక నువ్వు యివ్వాళ గోంగూరపచ్చడి చేసి దాంతో రెండుముద్దలు తిన్నావంటే మరి విడిచిపెట్టవ్" అన్నాను నవ్వుతూ.

అందరూ అన్నీ చెబుతారు. నాకదేమిటోగాని గోంగూర పచ్చడి

తిన్నరోజున కడుపంతా దేవినట్లుగా వుంటుంది. వద్దుబాబూ దానికో నమస్కారం'' అన్నది రెండు చేతులూ జోడిస్తూ.

"నీకేమీ పడవు. ప్రతిదానికీ ఏదో ఒకవంక చెబుతావు'' అన్నాను కోపంతో.

ఇంతలో మా తమ్ముడు ప్రభాకరం అక్కడికివచ్చి "ఏమిటివదినా! అన్నయ్యా నువ్వూ దేన్నిగురించో వాదించుకుంటున్నారు'' అన్నాడు. "చూడు ప్రభాకరం! మీ అన్నయ్యకు పట్టిందే పట్టు. ఇవ్వాళ గోంగూర పచ్చడి చెయ్యమంటున్నారు. నేనేమో పులుసువండుతే బాగుంటుందని అన్నాను. అందుకని మీ అన్నయ్యకి కోప మొచ్చింది. నువ్వేచెప్పు పులుసు బాగుంటుందా? పచ్చడి బాగుంటుందా?" మరిదిని మధ్యవర్తిగా పెట్టుకొని అన్నది.

"రెండూ బాగుండవు. చక్కగా పప్పువేసివండుతే బాగుంటుంది."

"సరిపోయె! మీ అన్నదమ్ములిద్దరూ ఒక యింటివారె!" అన్నది మా శ్రీమతి.

"ఒక తల్లిబిడ్డలం ఒక యింటి వారముకాక వేరొక యింటి వార మవుతామా? అది సరేలే గానివదినా! ఎన్నాళ్లనుండో గోంగూరపప్పు తినాలని తహతహలాడుతున్నాను. ఎప్పుడో రెండేళ్ళ క్రితం నా స్నేహితుడి ఇంటికి భోజనానికివెళ్ళితే వడ్డించారు. ఎంత మజాగా వుందనుకొన్నావ్. ఇప్పటికి కూడా మరుపు రాకుండా వుందంటే నమ్ము. నామీద దయ అనేదివుంటే యివ్వాళ నువ్వు పప్పు వండాలిసిందే."

"అదేమిటోయి! నువ్వూ యిట్లా అంటే ఏలా? చిన్నప్పటినుండి నాకు గోంగూరపులుసు అంటే నోరూరుతుంది. ఇవ్వాళ ఏమయినా పులుసే వండుతాను" మీ అన్నదమ్ములు ఏమనుకొన్నా సరే!" పెంకిగా అన్నది మా శ్రీమతి.

"రాజ్యం చూడు యివ్వాళ నువ్వుగాని గోంగూర పచ్చడి చెయ్యకపోయావా ఏకాశీ రామేశ్వరమో లేచిపోతా!" అన్నా కోపంతో.

"అవ్వ! అవేంమాటలండీ! మీ మంకుపట్టు మీదేగాని రెండోవారి మాట వినిపించుకోరుగదా! నా మాట విని యివ్వాళిటికి గోంగూర పులుసు చెయ్యనియ్యండి. మరో మాటు పచ్చడి చేసుకుందాం" అన్నది మా శ్రీమతి తనమాట ఎట్లాగయినా నెగ్గించుకోవాలనే ఉద్దేశ్యంతో.

"చూడువదినా యిట్లా ఎవరికి వారే యమునాతీరే అంటుంటే ఎట్లా ముందు ఆ గోంగూర ఏదో కోసుకొద్దాం పదండి. ఆతరువాత పప్పా! పులుసా! పచ్చడా! అని పోట్లాడుకోవచ్చు" అన్నాడు మా తమ్ముడు రాజీగా.

"సరే! పదరా!" అంటూ నేను ఒకబుట్టా, మా శ్రీమతి ఒకబుట్టా, మా తమ్ముడొకబుట్టా ముగ్గురం మూడుబుట్టలతో దొడ్లోకి వెళ్లాం. అక్కడికి వెళ్ళిచూస్తే ఏముంది! ఎవరిదో గేదె గోంగూరంతా నున్నగా తిని నెమరువేస్తోంది. మమ్మల్ని చూసి బెదిరి చక్కా పోయింది. అది చూసి నేము ముగ్గురం తెల్లబోయాం.

"నామతి మండిపోనూ పని చేసేది వస్తుందని తలుపులీసి అట్టె పెడితే, మనఖర్మానికి యీ గేదె ఎక్కడ దాపురించిందోగాని అంతా తినిపోయింది" అని మా శ్రీమతి శోకాలు తియ్యటం మొదలెట్టింది."

"ఊరుకో వదినా పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిందని మన ముగ్గురం పచ్చడా? పులుసా? పప్పా అని కొట్లాడుకుంటుంటే గేదెవచ్చి మన సమస్యను మా బాగా పరిష్కరించి పెట్టింది" అన్నాడు మా తమ్ముడు.

వాళ్లమాటలకు నాకు నవ్వాలో ఏడవాలో తెలియలా. ఆ రోజుకు మటుకు పచ్చడీ లేదు. పులుసూ లేదు. పప్పూ లేదు. నాకుమటుకు ఆరోజల్లా "పెల్లుల్లిపెట్టి పొగచిన.........." అన్న పద్యం మాటి మాటికి నెమరుకు వస్తూనేవుంది.

★

సిద్ధముగ నున్నది.

డాన్ క్విక్ సెట్

(DON QUIXOTE)

మూలం:

సెరివాన్ టెజ్

అనువాదం:

విశ్వాత్ముల నరసింహమూర్తి

తపాల ఖర్చు ప్రత్యేకం.

వెల రెండురూపాయలు

ఆంధ్ర గ్రంథమాల

మద్రాసు 1.